హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన జిల్లా న్యాయవాదులు

హైకోర్టు న్యాయమూర్తి అలిశెట్టి లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న జిల్లా న్యాయవాదులు

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 11 : తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి అలిశెట్టి లక్ష్మీనారాయణ బాసర సరస్వతీ దేవిని దర్శించునేందుకు ఆదివారం వెళ్లారు. మార్గమధ్యలో నిజామాబాద్ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో కాసేపు ఆగారు. ఆయనను జిల్లా న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. న్యాయవాదుల సమస్యలను వివరించారు. న్యాయమూర్తిని కలిసిన వారిలో నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవిదాస్ చందక్, కార్యదర్శి భాగీచరణ్, న్యాయవాద పరిషత్ జిల్లా ప్రధానకార్యదర్శి జగన్‌మోహన్‌గౌడ్, డిఫెన్స్ కౌన్సిల్స్ రాజ్‌కుమార్ సుబేదార్, ఉదయ్ కృష్ణ, అదనపు పీపీ బంటు వసంత్, న్యాయవాదులు బిట్ల రవికుమార్, దాస్, మాణిక్‌రాజు, వసంతరావు, పిండం రాజు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలుడు

- పేలుడు ధాటికి ధ్వంసమైన ఇల్లు
- భార్యాభర్తలకు తీవ్రగాయాలు

ధర్పల్లి, ఫిబ్రవరి 11 : సిలిండర్ గ్యాస్ లీకై పేలుడు సంభవించడంతో భార్యాభర్తలకు తీవ్రగాయాలు కావడంతోపాటు ఇల్లు ధ్వంసమైన ఘటన ధర్పల్లి మండలంలోని మైలారం గ్రామంలో చోటు చేసుకున్నది. సీఐ భిక్షపతి, ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన నరెండ్ల రాజన్న భార్య గంగుకు పక్షవాతం రావడంతో కొన్నేండ్లుగా మంచానికే పరిమితమైంది. ఇంట్లో వంటను రాజన్ననే చేస్తాడు. ఆదివారం ఉదయం 6.30 గంటల ప్రాంతంలో సిలిండర్‌ను వెలిగించేందుకు వెళ్లగా.. అప్పటికే గ్యాస్ లీకయి రూమంతా వ్యాపించి ఉండడంతో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. దీంతో రాజన్నకు నిప్పంటుకోవడంతో ఆయనకు 90 శాతం వరకు తీవ్ర గాయాలయ్యాయి. పేలుడు ధాటికి ఇళ్లంతా ధ్వంసమైంది. రాజన్న భార్య గంగుకు సైతం నిప్పంటుకొని 20 శాతం కాలిన గాయలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని దవాఖానకు తరలించారు. రాజన్న పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. చిన్న గదిలో గ్యాస్ లీకై ఉండడంతోనే పేలుడు సంభవించిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ, ఎస్సై తెలిపారు.

గ్యాస్ సిలిండర్ పేలడంతో ధ్వంసమైన ఇల్లు

పనులను పరిశీలిస్తున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

ఎత్తిపోతల పనుల పరిశీలన

మాక్లూర్, ఫిబ్రవరి11: ధర్మోరా గ్రామ పంచాయతీ పరిధిలోని బొంకన్‌పల్లి, ముల్లంగి(బీ) గ్రామాలకు సాగునీటి కోసం నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం పనులను జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు ఆదివారం పరిశీలించారు. పనులు చురుకుగా కొనసాగడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో లిఫ్ట్ నిర్మాణం కోసం తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ రూ.11.70 కోట్లు మంజూరు చేశారని అన్నారు. రెండు గ్రామాల్లోని 1100 ఎకరాలకు లిఫ్ట్ ద్వారా సాగునీరందనుందని పేర్కొన్నారు. మే నాటికి పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ జడ్పీ చైర్మన్‌కు తెలిపారు. అనంతరం మాందాపూర్‌లో పారిశుద్ధ్య కార్యక్రమాల్లో జడ్పీ చైర్మన్ పాల్గొన్నారు. ఎంపీడీవో జైక్రాంతి, పశువైద్యాధికారి కిరణ్‌దేశ్‌పాండే పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశపరీక్ష

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 11 : మండలంలోని ధర్మారంలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల (బాలికల) పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా కో-ఆర్డినేటర్ సంగీత తెలిపారు. ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు టీఎస్‌డబ్ల్యూఆర్, టీటీడబ్ల్యూఆర్, టీఆర్ఈఐ, ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశం కోసం పరీక్షను నిర్వహించినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రంలో 480 మంది విద్యార్థులకు 449 మంది హాజరైనట్లు తెలిపారు. జిల్లాలోని 7 సాంఘిక సంక్షేమ గురుకుల పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా.. మొత్తం 2904 మంది విద్యార్థులకు 2746 (95.66శాతం) మంది హాజరైనట్లు వెల్లడించారు.

ఎడపల్లిలో 227 మంది విద్యార్థుల హాజరు..

ఎడపల్లి బాలికల గురుకుల పాఠశాలలో పరీక్ష రాసి బయటికి వస్తున్న విద్యార్థులు

ఎడపల్లి, ఫిబ్రవరి11: తెలంగాణ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రం శివారులోని బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన పరీక్షకు 240 మంది బాలబాలికలు హాజరు కావాల్సి ఉండగా 227 మంది హాజరయ్యారు. 13 మంది గైర్హాజరయ్యారు. ప్రవేశ పరీక్ష ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించారు. విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు పరీక్ష కేంద్రానికి ఒక గంట ముందే చేరుకున్నారు. పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. స్థానిక ఎస్సై విక్రం పరీక్షా కేంద్రానికి చేరుకొని పర్యవేక్షించారు.

నేడు నవీపేట మండల సభ

నవీపేట,ఫిబ్రవరి 11: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ సంగెం శ్రీనివాస్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీవో రామకృష్ణ ఆదివారం ఒక ప్రకనటలో తెలిపారు. పలు సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి11: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్, ఆర్మూర్ ఏరియా అధ్యక్షుడు అనిల్ కుమార్ మాట్లాడుతూ విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని, విద్యాశాఖ మంత్రిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

నవీపేట ఎంపీడీవో బదిలీ

నవీపేట, ఫిబ్రవరి 11: మండల అభివృద్ధి అధికారి సయ్యద్ సాజీద్ అలీ బదిలీ అయ్యారు. త్వరలో నిర్వహించనున్న ఎంపీ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల కమిషన్ కామారెడ్డికి బదిలీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులను జారీ చేసింది. నవీపేట ఎంపీడీవో స్థానాన్ని భర్తీ చేయాల్సి ఉంది.

సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టుకు తృతీయస్థానం

కంఠేశ్వర్, ఫిబ్రవరి 11 : హనుమకొండలోని ధర్మాసాగర్ జిల్లా పరిషత్ హై స్కూల్ క్రీడా మైదానంలో 10, 11వ తేదీల్లో నిర్వహించిన 9వ జూనియర్ రాష్ట్ర బాలుర సాఫ్ట్‌బాల్ పోటీల్లో నిజామాబాద్ జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచినట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, మర్కంటి గంగామోహన్ తెలిపారు. మహబూబ్‌నగర్ జట్టుపై 4-3 తేడాతో గెలుపొందినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాంబశివరావు, నవీన్‌కుమార్, స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ రాజు చేతుల మీదుగా క్రీడాకారులకు పతకాలను అందజేశారు. టోర్నమెంట్‌లో ఆర్మూర్‌కు చెందిన ఆల్‌రౌండర్ ప్లేయర్ కళ్యాణ్‌రాజ్ ప్రత్యేక బహుమతిని అందుకున్నాడు. జట్టుకు కోచ్, మేనేజర్లుగా మర్కంటి గంగా మోహన్, నరేశ్, అనిల్ వ్యవహరించినట్లు తెలిపారు.

తృతీయ స్థానంలో నిలిచిన నిజామాబాద్ జిల్లా జట్టు

గుర్తుకొస్తున్నాయి..

కోటగిరి, ఫిబ్రవరి 11: కోటగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1974- 2000 సంవత్సరం వరకు విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కిడ్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకరి నొకరు పరిచయం చేసుకొని, పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులకు కిడ్స్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కిడ్స్ నిర్వాహకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

మోపాల్ మండలంలోని ప్రెసిడెన్సీ పాఠశాల 28వ వార్షికోత్సవాన్ని భూమా రెడ్డి కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీఐఈ జిల్లా అధ్యక్షుడు రాజీవ్ దువా, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు హాజరై మాట్లాడారు. జాతీయస్థాయి క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులను సన్మానించి, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, స్టాల్స్ ఆకట్టుకున్నాయి.

– మోపాల్ (ఖలీల్‌వాడి), ఫిబ్రవరి 11

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా..

బట్టాపూర్‌లో మూడ్ గంగారాం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 11: ఏర్గట్ల మండలంలోని పలు బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. మాజీ సర్పంచ్ గుల్లె లావణ్య భర్త గంగాధర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బట్టాపూర్‌లో బీఆర్ఎస్ ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు మూడ్ గంగారాం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ రెండు బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. అన్నివిధాలా అండగా ఉంటానని వారికి ధైర్యం చెప్పారు.

ప్రొసీడింగ్ కాపీ అందజేత

బాల్కొండ, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలోని గ్రేవ్ యార్డు వద్ద సీసీ నిర్మాణం కోసం జడ్పీ కోఆప్షన్ మెంబర్ మొయాజ్ తన జడ్పీ నిధుల నుంచి కేటాయించిన రూ.5 లక్షల ప్రొసీడింగ్ కాపీని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వాహబ్, ముస్లిం నాయకులు ఫయాజ్, ఇఫ్తేకార్ తదితరులు పాల్గొన్నారు.

వీడీసీ ఆధ్వర్యంలో సన్మానం

సారంగాపూర్, ఫిబ్రవరి 11 : మండలంలోని ధర్మారం(ఎం) సర్పంచ్ అన్నం సునీతా రాంగోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాస్, వార్డు మెంబర్లను ఆదివారం వీడీసీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఐదేండ్ల పాటు గ్రామానికి సేవలందించి, పదవీ విరమణ పొందినందుకు సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సర్పంచ్, వార్డుమెంబర్లను సన్మానిస్తున్న వీడీసీ సభ్యులు

కేబీపీ అధ్యక్షుడిగా చిలువేరి పవన్

పవన్

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 11: కమ్మర్‌పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కమ్మర్‌పల్లికి చెందిన చిలువేరి పవన్‌కుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం కమ్మర్‌పల్లి బ్యాడ్మింటన్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా యోగా గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా రవి, కోశాధికారిగా చింత ప్రదీప్, సహాయ కార్యదర్శిగా సుంకెట రమేశ్ ఎన్నికయ్యారు. ఎన్నికకు పీఆర్‌వో ప్రొటెమ్ స్పీకర్‌గా వ్యవహరించినట్లు లుక్క గంగాధర్ తెలిపారు. బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

ఘనంగా సత్యసాయి సేవాసదన్ వార్షికోత్సవం

సంగీత విభావరి నిర్వహిస్తున్న బృందం సభ్యులు

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 11: బోధన్ పట్టణంలోని సత్యసాయి సేవాసదన్ 31వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలువురి సందేశాలు, ప్రముఖ గాయకుడు అక్కిరాజు శ్రీనివాస్ బృందంచే సంగీత విభావరి నిర్వహించారు. అనంతరం బాలవికాస్ పిల్లలకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ గోపాల్ రెడ్డి, జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, మహిళా కన్వీనర్ నాగమణి, గ్రామ సేవ ఇన్‌చార్జి ప్రవీణ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రొసీడింగ్ కాపీ అందజేత

బాల్కొండ, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలోని గ్రేవ్ యార్డు వద్ద సీసీ నిర్మాణం కోసం జడ్పీ కోఆప్షన్ మెంబర్ మొయాజ్ తన జడ్పీ నిధుల నుంచి కేటాయించిన రూ.5 లక్షల ప్రొసీడింగ్ కాపీని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ వాహబ్, ముస్లిం నాయకులు ఫయాజ్, ఇఫ్తేకార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ పండుగ

ఇందల్వాయి, ఫిబ్రవరి 11 : మండలంలోని చంద్రాయన్‌పల్లిలో పెద్దమ్మ పండుగను ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ప్రధాన వీధుల నుంచి బోనాలను ఊరేగించారు. గ్రామదేవతలకు బోనాలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పోతరాజులు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో ముదిరాజ్ సంఘ సభ్యులు ఆరెట్టి రఘు, శ్రీధర్, గంగాధర్‌తో పాటు సభ్యులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చిలో వైద్య శిబిరం

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు సల్వీనా కాంత్

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 11: బోధన్ పట్టణం ఆచన్‌పల్లిలోని సీఎస్ఐ చర్చిలో బోధన్ పట్టణంలోని ట్రూలైఫ్ దవాఖాన ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఉదయం ప్రార్థనల అనంతరం వైద్యురాలు సల్వీనా కాంత్, డాక్టర్లు సాయికుమార్, విఘ్నేశ్వర్ పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్ రెవరెండ్ అనీల్, ఎడ్వర్డ్, దమ్ముల జ్యోతిరాజ్, సుదీప్, పుష్పరాజ్, దాస్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

గోదావరిలో తగ్గిన నీటి మట్టం

పురాతన శివాలయం వద్ద తగ్గిన నీరు

రెంజల్, ఫిబ్రవరి11: కందకుర్తి వద్ద గోదావరిలో నీటి మట్టం తగ్గడంతో పురాతన శివాలయం భక్తుల దైవ దర్శనంలోకి వచ్చింది. వానకాలం నుంచి నదిలో నీరు నిండుగా ఉండడంతో శివాలయం పూర్తిగా నీట మునిగింది. ఆలీసాగర్‌ఎత్తి పోతల పథకం ద్వారా అధికారులు సాగు నీటిని విడుదల చేశారు. దీంతో నదిలో నీరు తగ్గింది. పురాతన శివాలయాన్ని భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటున్నారు.

ఇసుక లారీ సీజ్

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి11: పట్టణంలోని పెర్కిట్‌లో ఆదివారం వే బిల్లు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న లారీని బస్సు డిపోనకు తరలించి సీజ్ చేశామని మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ బి.నాగేశ్వర్ తెలిపారు. లారీని బస్సు డిపోకు తరలించి సీజ్ చేసినట్లు తెలిపారు.

డీసీసీబీ డైరెక్టర్ శరత్‌కు పోచారం భాస్కర్‌రెడ్డి పరామర్శ

శరత్‌ను పరామర్శిస్తున్న డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి

బోధన్, ఫిబ్రవరి 11: బోధన్ మండలం సిద్ధాపూర్ గ్రామానికి చెందిన డీసీసీబీ డైరెక్టర్ గింజుపల్లి శరత్ మాతృమూర్తి నాగేశ్వరి ఈనెల 4న గుండెపోటుతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. సిద్ధాపూర్ గ్రామంలోని శరత్ ఇంటికి భాస్కర్‌రెడ్డి వెళ్లి శరత్ మాతృమూర్తి చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. బీఆర్ఎస్ బాన్సువాడ మండలం నాయకుడు దొడ్ల వెంకటరామ్‌రెడ్డి, బోధన్ మండలం నాయకుడు బాల స్వామి తదితరులు ఉన్నారు.

కన్యకా పరమేశ్వరీ ఆలయంలో పూజలు

బోధన్‌లో పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్య కులస్థులు

బోధన్, ఫిబ్రవరి 11: బోధన్ పట్టణంలోని పోస్టాఫీస్ వద్ద ఆదివారం శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా మహిళలు అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గంజి వెంకటేశం గుప్తా, ప్రధాన కార్యదర్శి కంటాల రమేశ్, కోశాధికారి పబ్బ మురళి, సహాయ కార్యదర్శి బిల్కంటి అనీల్ తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్ పట్టణంలో ..

భీమ్‌గల్, ఫిబ్రవరి 11: పట్టణంలోని శ్రీ వాసవీ మాత ఆలయంలో వైశ్యులు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు జొన్నల భూపాల్, ఉపాధ్యక్షుడు జవాజి శ్రీనివాస్, కోశాధికారి రాజు, సభ్యులు వేణు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయకు ఘన నివాళి

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 11 : నిజామాబాద్ జిల్లా బీజేపీ కార్యాలయంలో పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి ఆధ్వర్యంలో దీన్ దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఏఎన్ఎం మృతి

భారతి(ఫైల్)

నందిపేట్, ఫిబ్రవరి 11: తల్వెద రెండో ఏఎన్ఎం భారతి(45) గుండెపోటుతో మృతి చెందింది. జిల్లా కేంద్రంలో నివసించే ఆమె ఆదివారం గుండెపోటుతో అపస్మారక స్థితిలోకి చేరింది. కుటుంబీకులు దవాఖనాలో చేర్పించగా అప్పటికే మృతి చెందింది. 9 ఏండ్లుగా ఆమె నందిపేట్ పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్నారు. భారతి భర్త గతంలోనే మృతి చెందాడు. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

కిడ్నాపర్లుగా భావించి ఇద్దరిని చితకబాదిన స్థానికులు

ఇద్దరు అనుమానితులను అదుపులో తీసుకుంటున్న పోలీసులు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి11: జిల్లాలో పిల్లల కిడ్నాపర్లు తిరుగుతున్నారన్న సమాచారం సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉంటున్నారు. కాలనీల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగిస్తున్నారు. ఆర్మూర్ పట్టణంలోని శాస్త్రి నగర్‌లో ఆదివారం పిల్లలు బయట ఆడుకుంటున్నారు. అదే ప్రాంతంలో అనుమానాస్పదంగా ఇద్దరు వ్యక్తులను చూసి పిల్లలు భయంతో కేకలు వేశారు.

దీంతో స్థానికులు ఇద్దరు నిందితులను పట్టుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని వివరాలు అడగగా బాన్సువాడకు చెందిన శివకృష్ణ, పొతంగల్‌కు చెందిన రమేశ్ అని చెప్పారు. ఇద్దరినీ పోలీసులు మరిన్ని వివరాల కోసం విచారిస్తున్నారు.

గ్రామాల్లో చలిబోనాల సందడి

కమ్మర్‌పల్లి నల్లపోచమ్మ ఆలయంలో పూజలు..



గోవిందపేట్‌లో మల్లన్న దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 11: మండలంలోని చలిబోనాల సందడి మొదలైంది. చలి బోనాల సమర్పణ తొలి ఆదివారం పోచమ్మ ఆలయాలు వేకువజాము నుంచే కిటకిటలాడాయి. మహిళలు శనివారం రాత్రే సిద్ధం చేసి పెట్టుకున్న చలి అన్నం, పెరుగు, బెల్లం, పుట్నాలు, కల్లు బోనాలను ఆదివారం ఉదయాన్నే ఐదు చేతుల పోచమ్మ, నల్ల పోచమ్మ ఊళ్లె పోచమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి సమర్పించారు. ఊరిలోనిపంట పొలాలు, పిల్లా పాపలను చల్లగా చూడాలని వేడుకున్నారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి11: పట్టణంలోని సర్వసమాజ్ ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించినట్లు అధ్యక్షుడు ఆకుల రాజు తెలిపారు.

మల్లన్న స్వామి ఆలయంలో పూజలు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి11: మండలంలోని గోవింద్ పేట్ మల్లన్న స్వామి ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆశీస్సులను తీసుకున్నారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

రెంజల్, ఫిబ్రవరి 11: కందకుర్తి వద్ద గోదావరిలో ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. గోదావరికి చేరుకున్న గుర్తు తెలియని వ్యక్తి నది వంతెనపై నుంచి నదిలో దూకిఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి వయస్సు 55 నుంచి 60 ఏండ్ల ంధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

సిరికొండ, ఫిబ్రవరి 11 : మండలంలో విద్యుత్‌షాక్‌తో కంచెట్టి బాబూరావు (40) మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాబూరావు తన పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై హెడ్ ఫ్యూస్ వైరు వేసే క్రమంలో విద్యుత్ షాక్ తగిలి రెండు చేతులు కాలిపోయాయి. గద్దెపై నుంచి కింద పడగా.. గమనించిన స్థానికులు జిల్లా కేంద్రంలోని దవాఖానకు తరలించారు. బాబూరావు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రాణం పోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.